# జడ్జిమెంట్

ఆరోజు జడ్జి విశ్వనాధంగారు ఇంటికి వస్తూనే ఆలోచనలో పడ్డారు. ఫైల్సు లోపల పెట్టి డ్రైవరు చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

"ఇక నువ్వెళ్ళొచ్చు." అన్నట్టు తల పంకించారు జడ్జిగారు.

లోపలకు వస్తూనే ఈజీఛైర్లో చేరగిలపడి "లా" పుస్తకాలు తిరగెయ్యడం మొదలుపెట్టారు. విశ్వనాధంగారి భార్య పార్వతమ్మ హార్లిక్సు కలుపుకొని గదిలోకి వచ్చింది.

"ఒక్క క్షణం కూడా విశ్రాంతి తీసుకోకపోతే ఎట్లాగండీ? ఎప్పుడూ కేసు స్టడీసేనా?" అంది భార్య పార్వతమ్మ గ్లాసు అందిస్తూ.

"ఏం చెయ్యమంటావ్? నా వృత్తి అలాంటిది?" లేని నవ్వు తెచ్చిపెట్టుకొంటూ హార్లిక్స్ గ్లాసు అందుకొన్నారు విశ్వనాధంగారు.

రెండు గుక్కలు హార్లిక్స్ సప్పరించి "ఇక నువ్వెళితే బాగుంటుంది" అన్నట్టు భార్య ముఖంలోకి చూశారు.

పార్వతమ్మ తనను కానట్టే ఎదురుగావున్న సోఫాలో చతికిలపడింది.

దాంతో జడ్జీగారు హార్లిక్స్‌మాట మర్చిపోయి మళ్ళీ పుస్తకాలలోకి తల దూర్చారు.

పార్వతమ్మ భర్త ముఖంలోకి ఓ నిముషం చూసింది.

"ఆ కేసు జడ్జిమెంటు రేపేనటగా?"

హంతకుల్లో ఒకడు అప్రూవర్‌గా మారినప్పుడు కూడా అదిరిపడని విశ్వనాథంగారు, నిజంగానే ఇంతెత్తున అదిరి పడ్డారు.

"ఏమిటంతగా ఎగిరి పడ్డారు?" పార్వతమ్మ మురిపెంగా భర్తను చూస్తూ అడిగింది.

విశ్వనాథంగారు భార్య ముఖంలోకి అయోమయంగా చూశారు.

"ఏమిటలా చూస్తారు?"

"ఏదో అన్నట్టున్నావ్?"

"అదేనండీ. ఆ కేసు జడ్జిమెంట్ రేపేనటగా?"

"ఏ కేసూ?"

"అయ్యో రాత ! మీకు మరీ ఇంత మతిమరుపైతే ఎట్లా ?"

"నాకు మతిమరుపైతే నష్టం నీకూ నాకూ ఏం లేదులే !"

"మరెవరికంటారు ? లాయర్లకా ?"

"వాళ్ళ సొమ్మేం పోతుంది ? కోర్టుకు న్యాయం కోసం వచ్చిన క్లయింట్లకు !" భార్య ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నారు జడ్జీగారు.

"అదే నేను చెప్పొచ్చేది !" పార్వతమ్మ చిటిక వేసినట్లు, కొమ్ములు తిరిగిన లాయరులా మాట్లాడింది.

విశ్వనాథంగారు తెల్లమొహంవేసి, చల్లారిపోయిన హార్లిక్స్ గడగడ తాగేసి, తెల్లమీసాలు తుడుచుకున్నారు.

పార్వతమ్మ భర్త చేతిలోని గ్లాసు అందుకొని "ఇవ్వాళ బెంచి కొచ్చిందటగా ? రేపు జడ్జిమెంటని...." ఆమె మాట పూర్తికాకుండానే జడ్జీగారు, 'ఎవరు చెప్పారూ ?' అన్నారు.

'ఎవరు చెప్పటం ఏమిటండీ ? మన ప్రకాశ్' భర్త పడకకుర్చీలోంచి నిలువునా లేవడంచూసి, మాట పూర్తికాకుండానే పార్వతమ్మ నోరు తెరచింది. చేతిలో వున్న గ్లాసు కిందకు జారిపోయింది. ప్రాణంలేని గ్లాసు

తనంతటుతను జారిపోదు కనక పార్వతమ్మే వదిలేసి వుండాలి. 'లా' దీన్ని గురించి ఏం చెబుతుందో, విచారించకుండానే, జడ్జిగారు గదిలోంచి 'రైజ్' అయి హాల్లోకి వచ్చారు. వంకెనవున్న చేతికర్రను అందుకొని వెనకే వచ్చి నిలబడ్డ భార్యకేసి చూశారు.

'ఇవ్వాళ కూడా వాకింగ్ ఏమిటి. అబ్బాయి పుట్టినరోజని మర్చిపోయారా ?' అన్నది.

'సరే ! అయితే కొంచెం ఆలస్యంగానే వస్తాలే !' అంటూ బయటకు నడిచారు విశ్వనాధంగారు.

పార్వతమ్మకు ఈ లా పాయింట్ అర్థంకాక తన్నుకు వచ్చింది. ఇంట్లో శుభకార్యం చేసుకుంటూ బయటకు వెళ్ళటం ఏమిటంటే, ఆలస్యంగా వస్తానంటూ భర్త బయటకుపోవటం ఏ మి టో ఆమెకు బోధపడలేదు. అయోమయంగా బయటకు వెళ్ళిపోతున్న భర్తకేసి చూసింది. జిత్తులమారి లాయర్ని బోల్తా కొట్టించినంత సంతోషంగా విశ్వనాధంగారు, భార్యకేసి ఓసారి చూసి రోడ్డుమీదకు వచ్చారు.

ఆయనగారి పెదవులపై విరిసిన హాసరేఖ వీధి మలుపు తిరిగేంతవరకూ వుంది. దానికి మూలమైన కథనాన్ని నెమరువేసుకుంటూ నడక సాగించారు విశ్వనాధంగారు. ఇంట్లో చినబాబు పుట్టినరోజు పండుగని తనకు తెలియంది

కాదు. చుట్టుపట్ల అమ్మలక్కలూ, పిల్లా జెల్లా యింట్లో చేరతారు. ఆ గందరగోళంతో తనకేమీ తోచదు. అమ్మలక్కలు తన మొహాన ఏదో దోబూచులాడుతున్నట్లు తనను తొంగి తొంగి చూడటం తనకు పరమ అసహ్యం. పిల్లల కాకిగోల తనకు మహాచిరాకు కలిగిస్తుంది. ఇంట్లో హడావిడి తగ్గేంతవరకూ తను హాయిగా, ప్రశాంతంగా షికారుచేసి తిరిగిరావచ్చు.

అంటే తన కొడుకు పుట్టినరోజు సంబరం చూడటం తనకు ఇష్టంలేదని కాదు. తండ్రిని మించిన తనయుడవుతాడు తన కొడుకు. కాని తను ఎంతో కష్టపడి పైకి వచ్చాడు. తన బిడ్డ తనకంటే చాలా అదృష్టవంతుడు. తనకు చిన్నతనంలో పుట్టినరోజంటూ ఒకటి వుంటుందనీ, ఆనాడు తలిదండ్రులు తన కోరికలు తీరుస్తారనీ తెలియదు. కటిక దారిద్ర్యంతో బాధపడే తలిదండ్రులకు, ఎప్పుడు ఏ పిల్ల పుట్టినరోజో జ్ఞాపకం వుంచుకొనే తీరికా, ఓపికా వుండేవి కావేమో! అంతవున్నా చెయ్యగలిగిందీ, సంతోషించ తగిందీ ఏదీ వుండేది కాదు.

విశ్వనాథంగారు కాలిబాటన నడుస్తూవుంటే, ఎంతో మంది తొలగి నిల్చొని నమస్కారాలుచేసి పోతున్నారు. అందరికీ, ఒకే రకం చిరునవ్వుతో తల పంకించి, చేయి పైకెత్తి నమస్కారంలాంటి అభినయం చేస్తున్నాడు. అలా చేసినప్పుడల్లా ఆ చేతిలోని కర్ర పైకీ కిందకూ ఆడుతుంది.

జడ్జీ అయాక ఎంతోమంది మిత్రులను తను పోగొట్టు కొన్నాడు. అంతకుముందు సాయంకాలాలలో తనతోపాటు షికారుకొచ్చే లాయరు రామయ్యగారిని తప్పించుకోవటానికి కొన్నిరోజులపాటు వాకింగే మానేయాల్సి వచ్చింది.

ఎప్పుడూ కదలకుండా కూర్చొని మెదడుతో పనిచేసే వాళ్ళకు గుండెజబ్బులు వస్తాయని ఆయనకు గట్టి నమ్మకం. అందరిలా వట్టి మెదడే కాకుండా తను గుండెతో కూడా పనిచేస్తాడు. ప్రతిసారీ జడ్జిమెంటు చదివేప్పుడు తన హృదయం కుతకుతలాడిపోతుంది. తను న్యాయం ఇవ్వగలిగానన్న తర్వాతగాని హృదయం తేలికపడదు. తను జడ్జిమెంటుకు కూర్చున్నప్పుడు వాదులూ, ప్రతివాదులూ, గుండెలు చిక్కపట్టుకొని తన మొహంలోకి చూస్తూ కూర్చుంటారు. ఆ చూపుల్ని తను భరించలేడు. ఆ చూపుల్ని తప్పించుకోవటానికి లాయర్ల మొహంలోకి చూస్తాడు. వాళ్ళ మొహాలు చూస్తుంటే మళ్ళీ తనకు ధైర్యం వస్తుంది. వాళ్ళ ఆలోచనలన్నీ కేసుల్లో క్లయింట్సునుంచి తాము వసూలు చేసిన డబ్బు, ఇంకా రావాల్సిన డబ్బును గురించే తిరుగాడుతుంటాయి. కేసు గెలిస్తే లాయరు తన ప్రతాపాన్నీ, తెలివితేటల్నీ చాటుకుంటాడు. ఓడితే " ఆనరబుల్ జడ్జి పొరపాటు చేశారు " అంటాడు.

తన కెందుకో గుండెజబ్బు వస్తుందని అనుమానం! అలాంటి అనుమానానికి ఆర్గుమెంటుగానీ, లా పాయింట్ గానీ ఏమీ లేదు, పెద్దవాళ్ళకు గుండెజబ్బు లొస్తాయి కాబట్టి! మిగతా జబ్బులొస్తే మందులతో వాటిని నయం చేయించుకో గలరు. గుండెజబ్బు మాత్రం మందులకు లొంగేది కాదుగా! అయినా ఈ ఆర్గుమెంటు ఏమీ బాగాలేదు. అయితే అది కూడా ఒక యాస్పెక్టులో కరెక్టే!

విశ్వనాథంగారు తన ఆలోచనలకు కళ్ళెం వేసేయటానికి ప్రయత్నించారు. అసలు బుర్రవున్న వాళ్ళకుండే జబ్బే అది. ఎటుపడితే అటు ఆలోచనలు కాన్సర్ లా పాకిపోతాయి.

ఇద్దరు మనుషుల్నీ, ముగ్గురు పిల్లలనూ వేసుకొని రిక్షా తొక్కుతున్నవాడికి ఇలాంటి ఆలోచనల బాధ లేదు. నిజంగా వాడికి మానసిక ప్రశాంతత వుంటుంది. శారీరక శ్రమ తప్పించి వాడికి మరే బాధా లేదు. రిక్షా లాగడం అయాక శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. కాని ఆలోచించేవాడి బుర్రకు నిద్రలో కూడా పూర్తి విశ్రాంతి దొరకదు.

ఆ రిక్షావాడు....అందులో ఏదో చట్టవ్యతిరేకంగా ఉన్నట్లనిపించింది. రిక్షాలో ఇద్దరు పెద్దవాళ్ళూ, ముగ్గురు పిల్లలూ....ముగ్గురు పిల్లలూ కలిసి ఎంతమంది పెద్ద వాళ్ళవుతారు! బరువులోనా? ఆలోచనల్లోనా? వ్యక్తిత్వం

లోనా ? ముగ్గురి వయస్సూ కలిపితే ఒక పెద్దవాడవడా ? అసలు మనుషుల్ని కూడిక వేయవచ్చునా ? కానిస్టిట్యూషన్‌లో ఏమంటుంది ? ఇది చాలా పెద్ద లిటిగేషన్ ! రిక్షావాడు కిందకు దిగి తోయటం మొదలుపెట్టాడు. రిక్షా తొక్కటానికి లైసెన్సుగాని తొయ్యటానికి లైసెన్సు వుందా ? తనలో తనే నవ్వుకున్నారు జడ్జిగారు. పార్కు గేటుముందు ఒదిగి నిలబడి ఇద్దరు చేతులు జోడించారు. తల ఆడించినట్లే ఆడించి విశ్వనాథంగారు పార్కులోకి ప్రవేశించారు.

ఆరున్నర దాటినా వాతావరణంలో వేడి తగ్గలేదు. అప్పటికే పిల్లలూ పెద్దలూ చాలామంది గార్డెన్‌లో వున్నారు. విశ్వనాథంగారు వెళ్ళి చెట్టుకిందగావున్న ఖాళీ బెంచీమీద కూర్చున్నారు. దూరంగా పబ్లిక్ రేడియోనుంచి గ్రామస్థుల కార్యక్రమం విన్పిస్తున్నది. బెంచీకి దగ్గరగా నడివయస్సు దాటిన ఓక ఆడమనిషీ, ఆమె ప్రక్కగా నెత్తిన పళ్ళబుట్టతో ఓ కుర్రాడూ వచ్చి నిలిచారు. పళ్ళబుట్ట బరువును భరించలేని ఆ పసివాని మెడ అటూ ఇటూ కదులుతోంది. ఆడమనిషి పిల్లవాడి నెత్తినుంచి పళ్ళబుట్ట దించింది. అంతకు ముందే నేలమీదవున్న పెద్ద పళ్ళతట్ట పక్కగా ఆ బుట్టను పెట్టింది. కుర్రాడికి పళ్ళమ్మి ఏదో పని పురమాయించింది. వాడు పరుగెత్తుకెళ్ళాడు, పళ్ళమ్మి రెండు గోతాలను పరిచి సైజులువారీగా మామిడిపళ్ళను పేరుస్తూ వుంది.

అంతలో ఆ కుర్రాడు నెత్తిమీద మూడు ఇటుకల్ని పెట్టుకొని చిన్నగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి నిలబడ్డాడు. వాడి నెత్తినుంచి ఒక్కొక్క ఇటుకే తీసి కింద పెట్టింది. కుర్రాడు చేత్తో నెత్తి రుద్దుకున్నాడు.

"ఇంకో మూడు తీసుకురారా నాగేషా !"

కుర్రాడు మళ్ళీ పరుగెత్తాడు హుషారుగా. విశ్వనాథంగారు ఉరుకులు తీస్తున్న కుర్రాణ్ని, పళ్ళమ్మనీ చూసి ముత్తవా మనమడు అయివుంటారనుకున్నాడు. మళ్ళీ కుర్రాడు నెత్తిమీద ఇటుకలతో వచ్చాడు. పళ్ళమ్మి ఇటుకల్ని అందుకుంది. ఈసారి రెండు చేతుల్తో నెత్తి రుద్దుకుంటూ, ముఖం అదోలా పెట్టి కుర్రాడు "మల్లమ్మోయ్! ఇంక సాలా !" అన్నాడు.

మల్లమ్మ ఇటుకల్ని చక్కగా పేర్చి వాటిమీద కూర్చుంది. కుర్రాడు ఎదురుగా నిల్చొని పళ్ళవంకే చూస్తున్నాడు.

విశ్వనాథంగారు కుర్రాణ్ణి పరిశీలనగా చూశారు. వాడు ఆమె మనమడు కాడు, అయితే అలా పేరుపెట్టి పిలవడు. ఆమె కూడా అలాంటి పనులు చేయించదు. పైగా వాడి రూపం ! కాళ్ళూ చేతులూ, సన్నగా నల్లగా ఎండిపోయిన పుల్లల్లా వున్నాయి. పెద్ద తలా, గుండ్రటి ముఖం, నిరుసోగకళ్ళు. ఆ కళ్ళల్లో, బాలసహజమైన

అమాయకత్వం, చాంచల్యం గోచరిస్తున్నాయి. వాడి పొట్ట, జీవితంలో తన ప్రాముఖ్యం ఎంతగా వుందో చూపించటానికి అన్నట్లు ముందుకు పెరిగి వుంది. లాగు కుడికాలు చిరిగి మోకాలు దగ్గరగా వేలాడుతోంది. చొక్కా ఎడంచెయ్యి భుజంవరకే వుంది. పళ్ళమ్మి ఆ కుర్రాణ్ణి మళ్ళీ "ఒరేవ్ నాగేషూ!" అని పిలిచింది.

కుర్రాడు ఉత్సాహంగా ముందుకు వెళ్ళాడు. జడ్జిగారు కుతూహలంగా వాళ్ళకేసి చూడసాగాడు.

మల్లమ్మ అందించిన ఓ పెద్ద కూజాను తీసుకొని కుర్రాడు పరుగుతీశాడు. ఓసారి పడబోయి తమాయించు కున్నాడు.

"ఒరేయ్ నాగేషూ! పడేవ్! కూజా జాగ్రత్త!" మల్లమ్మ హెచ్చరికలో 'కుర్రాడు పడితే', కూజా పగులు తుందేమోనన్న పాయింటే ముఖ్యం అని జడ్జీగారికి అర్థం అయింది.

అప్పటికే చాలాదూరం వెళ్ళిపోయాడు నాగేషు. నాగేష్ చక్కని పేరు. పిల్లవాడికి తల్లిదండ్రులున్నారా? వాడెవడు? ఎందుకిలా వుంటాడు? ఆలోచిస్తున్న విశ్వనాథంగారికి తన చిన్నతనం గుర్తొచ్చింది. అంతలో అతి వైభవంగా పుట్టినరోజు జరుపుకొంటున్న కొడుకు కళ్ళకు కనిపించాడు. నిండు కూజాను రెండు చేతులతో పొట్టకు

అడిమపట్టుకొని అతి కష్టంగా ఒక్కొక్క అడుగే వేస్తూ అల్లంత దూరంలో, ఎదురుదెబ్బ తగిలి బొక్కబోర్లాపడిన నాగేషునుచూసి జడ్జీగారి మనస్సు కలుక్కుమంది. 'అయ్యో నా కూజా' అంటూ మల్లమ్మ పరుగుతీసింది నాగేష్ దగ్గరకు. ముక్కలయిన కూజాను దిగులుగా చూస్తూ, మల్లమ్మ వేస్తున్న మొట్టికాయల్ని తింటూ అపరాధిలా నిల్చున్నాడు. జడ్జీగారికి ఏం చెయ్యాలో తోచలేదు. సానుభూతితో చూశారు.

"ఊరుకో పాపం, చెయ్యాలని చెయ్యలేదుగా !" ఆ పక్కనే కూర్చొని భర్తతో కబుర్లు చెబుతూ పల్లీలు తింటున్న ఓ యువతి అంది.

మల్లమ్మ నాగేషును తిట్టుకుంటూ వచ్చి దుకాణం దగ్గర కూర్చుంది. నాగేషు పిల్లిలా వచ్చి పళ్ళదుకాణానికి అల్లంత దూరంలో నిల్చున్నాడు. అశాంతిగా అటూ ఇటూ తిరగసాగాడు. వాడి అవస్థ అంతా పళ్ళమ్మి మళ్ళీ పిలవాలనే అని అర్థంచేసుకున్న విశ్వనాథం గారు లోలోపల నవ్వుకున్నారు. మల్లమ్మ వాడిని గమనించనట్లే కూర్చుని పళ్ళు అమ్ముకోసాగింది. నాగేషు విశ్వనాథం కూర్చున్న బెంచీకి వెనగ్గా వచ్చి నిలబడ్డాడు....

"ఇట్టా రారా ! సచ్చినోడా !" పిల్చింది మల్లమ్మ. నాగేషు ఉత్సాహంగా ముందుకు దూకాడు.

తట్టలో గుడ్డకిందగా వున్న చెంబుతీసి ఇచ్చింది మల్లమ్మ. వాడు హుషారుగా చెంబు తీసుకొని పరుగెత్తు కెళ్ళాడు. అయిదు నిమిషాల్లో నీళ్ళు తెచ్చి పళ్ళమ్మికి అందించాడు. పళ్ళమ్మి చెంబెడు నీళ్ళు గటగటా తాగేసి, కొద్దిగా మిగిల్తే దూరంగా విసరికొట్టి, మళ్ళీ చెంబును తట్టలో పెట్టుకొంది. ఈసారి నాగేషు మల్లమ్మకు ఎదురుగా గొంతుకూర్చున్నాడు. అరచేతిలో గడ్డాన్ని ఆనించుకొని, పెద్ద కళ్ళను పూర్తిగా విప్పుకొని మామిడిపళ్ళకేసి చూడసాగాడు. పెదవులు తడుపుకుంటున్నాడు. వాడి కళ్ళలో మామిడిపళ్ళ తాలూకు పసిమి తళుక్కుమంది.

పళ్ళమ్మి వాడిని కళ్ళతోనే దగ్గరకు పిలిచి యేదో చెప్పింది. నాగేషు ఆమె పక్కన నిలబడి "మామిడిపళ్లూ! రసాలు! పెద్దరసాలు. ఒక్కసారి తిని చూడండి!" అంటూ గట్టిగా కేకలు పెడుతుంటే, గొంతు నరాలు ఉబుకుతున్నాయి. విశ్వనాథంగారు నాగేషునూ, మల్లమ్మనూ కుతూహలంగా చూస్తూ కూర్చున్నారు. వ్యాపారం జోరుగా సాగింది. చాలావరకు పళ్లు అమ్ముడుపోయాయి.

నాగేషు మల్లమ్మ దగ్గరగా వెళ్లి చెయ్యి చాపాడు. "చచ్చినోడ! ఏం తొందర్రా! ఇస్తాలే! ఇంకా సగమన్నా అమ్ముడుపోలేదు." అంది మల్లమ్మ. నాగేషు మళ్లీ కేకలు పెట్టాడు! తారాస్థాయిలో వాడి కంఠస్వరం కీచు

మంటున్నది. మరో పావుగంటలో పళ్లన్నీ అమ్ముడు పోయాయి.

కుర్రాడిలో సహనం నశిస్తున్నట్లు గమనించారు విశ్వనాథంగారు. వాడు అరవటం మానేసి దుకాణం దరిదాపుల్లోనే అశాంతిగా తిరగసాగాడు. అంతలో ఓ పాతిక సంవత్సరాల యువకుడు, ఓ ఐదేళ్ళ కుర్రాణ్ని వెంటబెట్టుకొని పళ్ళదుకాణంకేసి వచ్చాడు. ఒక పండు కొని ఇచ్చాడు. నాగేషు కుతూహలంగా చూస్తూ కుర్రాడి పక్కగా వెళ్ళి నిల్చున్నాడు. ఓ చేత్తో రసం పీలుస్తూ, మరో చేత్తో తండ్రి చెయ్యి పట్టుకొని వెళుతున్న, ఆ కుర్రాడి వెనకే నాగేషు కొంతదూరం నడిచాడు. పండుతింటున్న కుర్రాడి ముఖంలోని ఆనందాన్ని అందిపుచ్చుకొని నాగేషు తిరిగి మల్లమ్మ దగ్గరకొచ్చి నిలబడ్డాడు. ఈసారి వాడి ముఖంలో మొండితనం కనిపించింది. పళ్ళమ్మి ఓ నిముషం వాడి ముఖంలోకి చూసి ఏమనుకుందో, తట్టలో చెయ్యిపెట్టి, ఓ చిన్న పండు తీసి నాగేష్ చేతిలో విసురుగా వేసింది. నాగేషు ఆశగా అందుకున్నాడు. ఆ పండు తాలూకు స్పర్శవల్ల హృదయంలో కలిగిన ఆనందం కళ్ళలో మెదిలింది. ఆత్రంగా మూతిదగ్గర కొంచెం కొరికి పండు రసం జుర్రుకున్నాడు నాగేషు. క్షణంలోనే వాడి ముఖం వికృతంగా మారిపోయింది. నోట్లో మిగిలిన రసాన్ని ఊసేసి, చేతిలో పండును నేలకు కసిగా విసిరికొట్టాడు.

"ఓరి నచ్చినోడా! బంగారంలాంటి పండును నేలపాలు చేశావు!" అంది మల్లమ్మ.

"కుళ్ళిపోయింది ఇచ్చావు. ఇంకోటి ఇయ్యి!" చేతిని చొక్కాకు తుడుచుకుంటూ అడిగాడు నాగేషు.

"దొంగ నచ్చినోడా! ఇంకోటి ఇయ్యాలా! పో దూరంగా!" కళ్ళెర్రజేసి కసిరింది మల్లమ్మ.

నాగేషు ముఖంలో దుఃఖం, కోపం ముప్పిరి గొన్నాయి. దుకాణం దరిదాపుల్లోనే పళ్ళమ్మని ఉరిమి ఉరిమి చూస్తూ తిరగసాగాడు. ఆకాశంలో పూర్తిగా వెలుగు ఆరిపోలేదు. కాని గార్డెన్‌లో దీపాలు వెలిగాయి.

"మనదేశం నుంచి ఎగుమతి అవుతున్న మామిడి పళ్ళకు రష్యాలో చాలా గిరాకిగా వుంది—" రేడియోలో తెలుగులో వార్తలు వినిపిస్తున్నాయి.

మల్లమ్మ నాగేషును దగ్గరకు పిల్చింది. వాడు ఉత్సాహంగా వచ్చాడు. చెంబు అందిస్తూ నీళ్ళు తెమ్మంది. వాడు చెయ్యి చాపలేదు. "ముందు పండు ఇవ్వు నీళ్ళు తెస్తాను."

"ఇచ్చాగా?"

"అది కుళ్ళిపోయింది."

"రేపిస్తాలే."

"ఉహూ! ఇప్పుడే ఇవ్వాలి!"

"ఇస్తాలే నీళ్ళు తే!"

"అదేం కుదరదు. ముందు పండిస్తేనే!" మొండిగా అన్నాడు నాగేషు.

"దొంగసచ్చినోడా! ముప్పయ్ పైసల కూజా ముక్కలు చేశావు. అరణాల పండు, బంగారంవంటి పండు మట్టిపాలు చేశావ్" అంటూ మల్లమ్మ చెంబు తీసుకొని లేచి నిలబడింది. దుకాణంకేసి ఓసారి పరీక్షగా చూసుకుంది.

"బాబుగారూ!" తమవైపే చూస్తున్న విశ్వనాథం గారిని సంబోధించింది. మల్లమ్మ ఏమీ చెప్పకపోయినా పళ్ళమ్మి ఉద్దేశాన్ని గ్రహించారు విశ్వనాథంగారు. మల్లమ్మ తిరిగి తిరిగి చూసుకుంటూ వెళ్ళిపోయింది. అలా పోతున్న మల్లమ్మనీ, కింద గోనెపట్టామీద పరచివున్న పళ్ళనీ మార్చి మార్చి చూశాడు నాగేషు. ఒకడుగు ముందుకువేసి, ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా బెంచీమీద కూర్చున్న విశ్వనాథంగారివైపు చూశాడు. ఆయనగారు తనను గమనిస్తున్నట్లు చూసి, ఏమీ ఎరగనట్లు దూరంగా నిలబడ్డాడు. దారేపోతున్న కుక్కమీద గడ్డ విసిరాడు.

ఇదంతా గమనిస్తున్న విశ్వనాథంగారికి ఓ తమాషా ఆలోచన వచ్చింది. తను గమనించనట్టే కూర్చుంటే నాగేషు

ఏం చేస్తాడో ! ముఖం తిప్పుకొని దూరంగా ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తున్నట్లు కూర్చున్నారు జడ్జిగారు. నాగేషు అటూ ఇటూ చూసి, రెండుసార్లు విశ్వనాథంగారి ముందుగా అటూ ఇటూ నడిచాడు. ఆయనకు నవ్వొచ్చింది. వాణ్ణి గమనించనట్లే దీక్షగా మరోవైపుకు చూడసాగాడు. నాగేషు పండ్ల దుకాణం దగ్గరకు, నడవాలనే ఉద్దేశం లేనట్లే నడిచాడు. అటూ ఇటూ ఓసారి చూసి వంగి, గబుక్కున ఓ పండుతీసి చొక్కాకింద పెట్టుకొని విశ్వనాథంగారివైపు చూశాడు. ఆయన తనను గమనించలేదని నిశ్చయించుకున్నాక ఆయనగారు కూర్చున్న బెంచీ వెనక్కు వెళ్ళి, బెంచీకింద గడ్డిలో పెట్టాడు. పండుమీద ఆ పక్కనేవున్న ఎండుటాకుల్ని కప్పాడు. మళ్ళీ ఏమీ ఎరగనట్లు వచ్చి బెంచీ చేతిమీద కూర్చుని, ముందుకూ వెనక్కూ ఊగుతున్నాడు. విశ్వనాథంగారు సర్దుకొని కూర్చుని నాగేష్ ముఖంలోకి చూశారు. వాడి కళ్ళల్లో ఏదో సాధించినట్లు సంతృప్తి వెలుగుతోంది. విశ్వనాథంగారు తనవైపే చూడటం గమనించిన నాగేష్ గుర్రాన్ని వేగంగా నడిపిస్తున్నట్లు ఆటలో మునిగిపోయాడు. మల్లమ్మ తిరిగి వచ్చింది. అనుమానంగా పళ్ళకేసి చూసుకుంది. మళ్ళీ నాగేషుకేసి చూసింది. విశ్వనాథంగారి ముఖంలోకి చూసి యేదో అడగబోయి మళ్ళీ ఊరుకుంది. పళ్ళను చేత్తో తాకి లెక్కపెట్టుకుంది. తల గోక్కుంటూ ఆలోచనలో పడింది

మల్లమ్మ. బొడ్లోనుంచి డబ్బులసంచి తీసి డబ్బులు లెక్క చూసుకోసాగింది. నాగేష్ మల్లమ్మను చూస్తున్నాడు. విశ్వనాథంగారు పసివాడి ముఖంలోని భావాలను చదవసాగారు.

"ఏం అవ్వా! నా పండు ఇస్తావా లేదా!" కళ్ళెగరేస్తూ ప్రశ్నించాడు నాగేష్. ఈసారి వాడి స్వరంలో మొదటి దైన్యం లేదు. మల్లమ్మ మాట్లాడకుండా చిల్లర డబ్బులు సంచిలోవేసి, మూతికట్టి, మళ్ళీ బొడ్లో దోపుకుంది.

నాగేషు బెంచీదిగి మల్లమ్మ దగ్గరగా వెళ్ళి చేతులు వెనక్కు కట్టుకొని నిల్చుని "నా పండు నా కిస్తావా లేక తీసుకోమంటావా!" అన్నాడు కనుబొమల్ని ఎగరేస్తూ.

"దొంగ వెధవ! ఈ ముసల్దాన్ని... ఎంత ఏడిపిస్తున్నాడు! అయినా ఆ మల్లమ్మది మాత్రం తప్పు కాదా!" జడ్జీగారు మీమాంసలో పడిపోయారు. ఆ సంఘటన అంతా తను కళ్ళారా చూశాడు. అంతే తను ఐ విట్నెస్ అన్నమాట! "దేముడి ముందు ప్రమాణంచేసి, ఉన్నదున్నట్లూ, జరిగింది జరిగినట్లూ, అంతా నిజమే...." బోనులో నిలబడిన ప్రాసిక్యూషన్ సాక్షి కథనం, జడ్జీగారి బుర్రలో గిర్రున తిరిగింది.

కుర్రాడిచేత పనిచేయించుకున్న మల్లమ్మ అతడికి ప్రతిఫలం ముట్టజెప్పాలి. అంటే పండు వాడికి న్యాయంగా రావాల్సిందే! "ఆమె ఇచ్చింది కుళ్ళిపోయింది" అని వాడంటాడు. ఆమె కుళ్ళిపోలేదంటుంది. నిర్ణయించాల్సింది

వాళ్ళిద్దరూ కాదు. "కుళ్ళిన పండు కాకపోతే పారెయ్యడు కాబట్టి అది కుళ్ళిందే అయివుండాలి!" నేచురల్ ఇన్ఫరెన్స్!

అయితే కూజా పగులగొట్టి మల్లమ్మకు నష్టం కలిగించాడు వాడు. వాడికి మించిన బరువు మోయమన్నది అది. యాక్సిడెంటల్‌గా కింద పడిపోయాడు వాడు. కాబట్టి నాగేషు నిర్దోషి. మల్లమ్మకు నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. "దేర్ ఫోర్! మల్లమ్మ నాగేషుకు వాడి శ్రమకు ప్రతిఫలంగా—వాడు కోరినట్టు—మామిడిపండు ఇవ్వాల్సి వుంది. కాని ఆమె ఇవ్వలేదు. అయినా వీడు తీసుకున్నాడు. దటీస్ ఇల్లీగల్! టాంట్ అమౌంట్ టూ క్రైం. అది నేరం....అంతేకాదు....నేరాన్ని దాస్తున్నాడు. అది మరొక కౌంట్ కింద శిక్షార్హం. పైగా మల్లమ్మను పండివ్వమని బెదిరిస్తున్నాడు. దట్ కమ్స్ అండర్ సెక్షన్....మల్లమ్మ లేచి నిలబడి జడ్జీగారి ముందుకొచ్చి ప్రాధేయపూర్వకంగా న్యాయాన్ని అర్థించింది. నాగేషు భయంగా బెదురుగా జడ్జీగారి కళ్ళలోకి చూశాడు. జడ్జి విశ్వనాధంగారి ముఖం గంభీరమయింది. ఏది యేమయినా నాగేషు 'లా' తన చేతుల్లోకి తీసుకున్నాడు. వాడి కా అధికారం లేదు, పసితనం కావచ్చు! తెలియక చేసినా నేరం నేరమే! శిక్షార్హమే!....

జడ్జీ విశ్వనాధంగారు బెంచీమీదనుంచి చివాల్న లేచి నిలబడ్డారు. "ఓ అమ్మా! బల్లకింద చూడు!"

విశ్వనాథంగారి మాటలు మల్లమ్మ పూర్తిగా అర్థం చేసుకొనే ప్రయత్నంలో వుండగానే, నాగేషు బల్లకింద దూరి, పండును తీసుకొని పరుగు లంకించుకొన్నాడు.

"అయ్యో! అయ్యో! అర్థరూపాయి పండ్రో! నీ జిమ్మడ! నీకు పొయ్యేకాలం రాను!" అంటూ మల్లమ్మ శక్తికొలదీ నడక రూపంలోవున్న పరుగులోనే వెంటపడింది.

విశ్వనాథంగారు చేతికర్ర తీసుకొని ముందుకు సాగారు. రోడ్డుమీద బ్రహ్మరాక్షసి అట్టహాసంలా లారీ ధ్వని వినిపించింది. వెంటనే జనం కేకలు. విశ్వనాథంగారు పబ్లిక్ గార్డెన్ గేటుదాటి రోడ్డుమీదకు వచ్చాడు. ఎదురుగా లారీ, దానిచుట్టూ జనం. పళ్ళమ్మి మల్లమ్మ "అయ్యో బిడ్డా!" అంటూ రోదిస్తోంది. విశ్వనాథంగారు జనాన్ని తోసుకొని ముందుకు వచ్చారు.

ఒక పసివాడి చెయ్యి....ఆ చేతికి పక్కగా రక్తపు మడుగులో చితికిపోయిన మామిడిపండూ....ఉరిశిక్ష వేయబడినవాడి కాళ్ళకింద బల్లలా, జడ్జీగారి కాళ్ళకింద నేల దూరమయింది. విశ్వనాథంగారు శరీరాన్ని రిక్షాలో వేసుకొని ఇంటికి చేర్చుకున్నారు.

రిక్షాదిగి లోపలకు వస్తున్న విశ్వనాథంగారికి, అప్పుడే గేటులోంచి బయటకువస్తూ ఒక పంచెకట్టు పెద్దమనిషి తారసపడ్డాడు. విశ్వనాథంగార్ని చూసి ఆయన తత్తర బిత్తరలాడుతూ, రోడ్డుమీద ఆగివున్న టాక్సీలోకి దూకి అదే పోతపోయాడు.

ఎవరు ! ఎక్కడో చూసినట్టుందే.

జడ్జీగారు ఆలోచించే మానసిక స్థితిలో లేరు.

హాల్లోకి ప్రవేశించిన విశ్వనాధంగారికి పెద్ద మామిడిపండ్ల గంప ఒకటి స్వాగతం పలికింది. నిశ్చేష్టుడై నిలబడ్డ భర్త చేతిలోని ఒంకికర్ర అందుకొంది పార్వతమ్మ.

" ఏమిటువి ? "

" మామిడిపళ్ళు ! కనిపించటంలా ! " అంటూ పార్వతమ్మ వంటింట్లోకి వెళ్ళింది.

పళ్ళగంపను చూస్తూ కుర్చీలో కూలబడ్డారు విశ్వనాధంగారు. అంతలో పార్వతమ్మ ఓ పెద్ద వెండిగ్లాసుతో తిరిగి వచ్చింది.

పార్వతమ్మ చేతిలోవున్న గ్లాసు చూస్తూ "ఏమిటది ? " అన్నారు విశ్వనాధంగారు.

" రెండు పళ్ళు తీస్తేనే గ్లాసుడు రసం వచ్చింది. పెద్దరసాలు గదూ ? " అంటూ గ్లాసు అందించబోయింది.

జడ్జి విశ్వంనాధంగారు గుండెమీాద చెయ్యి వేసుకొని యింకా అది ఆగిపోకుండా ఆడుతూనే వున్నందుకు ఆశ్చర్యపోయారు.

భార్య కాళ్ళకేసి చూశాడు. అవి యింకా నేలమీాదే ఆనివుండటం ఇంకా ఆశ్చర్యాన్ని కలిగించింది.

( యువ మాసపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక 1977 )